సాక్షి
కుమురం భీం

సోమవారం । 24 । జూలై । 2023



గ్రామాల్లో మొహర్రం
జిల్లాలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు కొనసాగుతున్నాయి. హిందూ, ముస్లింలు ఐక్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

8లో▸

26లోగా రిపోర్ట్ చేయాలి
కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 26లోగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిపోర్ట్ చేయాలని ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. రిపోర్ట్ చేయని విద్యార్థుల ప్రవేశాలు రద్దు చేస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం 70136 07011 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.5 /25.2

వాతావరణం
ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు, అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కాగజ్‌నగర్‌లోని పటేల్ గార్డెన్స్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన పాత పెన్షన్ సాధన సంకల్ప సభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, నాయకులు పాల్గొన్నారు. కాగా, పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఆదివారం రాత్రి కాగజ్‌నగర్ పట్టణానికి చేరుకుంది. ప్రధాన వీధుల నుంచి పటేల్ గార్డెన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

టీచర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: సస్పెన్షన్‌కు గురైన టీచర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకు చింతలమానెపల్లి మండలం దిందాలోని ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను డీఈవో అకారణంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సందర్శించిన సమయంలో వాగు వద్ద ఉన్న ఉపాధ్యాయులు తమ సమస్యలు వివరించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 26న కౌటాలలో బీఎస్పీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. మణిపూర్‌లోని ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు శ్రీరాంనగర్ కాలనీలోని గణపతి నివాసంలో బీఎస్పీ ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు సోయం చిన్నయ్య, తిరుపతి, ముఖ్తియార్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: మణిపూర్ అల్లర్లకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని జిల్లా కేంద్రంలో ఆదివారం ఐక్య ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యూటీఎఫ్, టీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇందులాల్, కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో అమాయకుల ప్రాణాలు తీస్తూ, మహిళలను అవమానపర్చిన దుండగులను శిక్షించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనలపై మౌనంగా ఉండటాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు హేమంత్ షిండే, ఊశన్న, మనుకుమార్, శంకర్, సుభాష్, విద్యార్థి సంఘం నాయకులు దినకర్, కార్తీక్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని ఆశ్రమ వసతిగృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

భోజనం..

మరింత పుష్టిగా..!

- డైట్ చార్జీలు 26 శాతం పెంపు
- జిల్లాలో 82 వసతిగృహాలు
- 30 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం
- ఈ నెల నుంచి అమలుకు నిర్ణయం

పెరిగిన డైట్ చార్జీలు (నెలకు రూ.లలో)

తరగతులు	ప్రస్తుతం	పెరిగినవి
3 నుంచి 7	950	1,200
8 నుంచి 10వరకు	1,100	1,400
ఇంటర్ నుంచి పీజీ	1,500	1,875

ఆసిఫాబాద్‌రూరల్: గురుకుల పాఠశాలల విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందించేందుకు డైట్ చార్జీలు 26 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెరిగిన చార్జీలు ఈ నెల నుంచే అమలులోకి రానున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో గిరిజన, ఎస్సీ, బీసీ, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది.

2015 తర్వాత పెంపు..

జిల్లాలోని వసతి గృహాల్లో చదివే విద్యార్థులు చాలా మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. అనేక మంది గిరిజన విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నారు. పౌష్టికాహార లోపంతో గతేడాది వసతిగృహాల్లో పలువురు విద్యార్థులు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. కరోనా విలయం తర్వాత నిత్యావసరాలు, కూరగాయలు, కోడిగుడ్లు, చికెన్ ధరలతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. అధిక ధరలతో చాలా మంది నిర్వాహకులు వంద మందికి సరిపడా సరుకులతోనే 150 మందికిపైగా విద్యార్థులకు వండిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2023- 24 విద్యా సంవత్సరంలో కూడా జిల్లాలోని ఆశ్రమ వసతి గృహాలకు సరుకుల సరఫరా నిలిచిపోవడం, బిల్లులు పెండింగ్ ఉండటంతో విద్యార్థులు హాస్టళ్లకు రాలేదు. ఐటీడీఏ పీవో స్పందించి చర్యలు తీసుకోవడంతో హాస్టళ్లలో హాజరు పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందించేందుకు ముఖ్యమంత్రి మంత్రులతో సబ్ కమిటీని నియమించిన విషయం తెలిసిందే. సబ్ కమిటీ నివేదిక ప్రకారం ప్రస్తుతం ఉన్న చార్జీలను 20 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెంచిన చార్జీలను జూలై 1 నుంచి అమలు చేయనున్నారు.

జిల్లాలో 30 వేల మంది..

జిల్లాలో వివిధ రకాల వసతి గృహాలు, గురుకులాలు మొత్తం 82 ఉన్నాయి. ఇందులో గిరిజన ఆశ్రమాలు 46, సాంఘిక సంక్షేమ గురుకులాలు 5, గిరిజన గురుకులాలు 5, గిరిజన మహిళా డిగ్రీ కళాశాల 1, మైనార్టీ గురుకులాలు 3, మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాలు 5, కేజీబీవీలు 15, టీఎస్ ఈఎంఆర్ఎస్ 1, అర్బన్ రెసిడెన్షియల్ గురుకులం ఒకటి ఉంది. సుమారు 30 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం మరికొన్ని చోట్ల అడ్మిషన్లు పూర్తికాకపోవడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కుమురంభీం జిల్లాకు కేటాయించిన బీసీ డిగ్రీ కళాశాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్నారు.

మెనూ పాటించాలి



వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ పాటించి పోషకాహారం అందించాలి. ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచుతూ సరైన నిర్ణయం తీసుకుంది. నాణ్యతతో భోజనం అందించాలి.

– ఆశిష్‌కుమార్, ఇంటర్, సోషల్ వెల్ఫేర్ ఆసిఫాబాద్

పౌష్టికాహారం అందుతుంది



డైట్ చార్జీలు పెంచడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం అన్నిరకాల ధరలు పెరిగాయి. దీంతో భోజనం సరిగా ఉండటం లేదు. పెంచిన చార్జీలతో విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుంది.

– అజయ్, ఇంటర్, సోషల్ వెల్ఫేర్ ఆసిఫాబాద్

విద్యార్థులకు మేలు



రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు డైట్ చార్జీలు 26 శాతం పెంచింది. దీనిని ఈ నెల నుంచే అమలు చేయనున్నారు. పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది.

– వెంకటప్రసాద్, మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల జిల్లా కన్వీనర్

జలపాతం అభివృద్ధికి కృషి



జలపాతం వద్ద కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎకో టూరిజం చైర్మన్ గోపాల్

తిర్యాణి(ఆసిఫాబాద్): చింతలమాదర జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. తిర్యాణి మండలం చింతలమాదర జలపాతాన్ని ఆదివారం సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ జలపాత వీక్షణకు వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఎకో టూరిజం కమిటీ చైర్మన్ తుంరం గోపాల్‌ని ఆదేశించారు. పర్యాటకులు మద్యం, ప్లాస్టిక్ వస్తువులు తీసుకురాకుండా చూడాల్సిన బాధ్యత టూరిజం కమిటీపైనే ఉంటుందన్నారు. లోతట్టు ప్రాంతాల్లోకి అనుమతించొద్దని, రక్షణ చర్యలు చేపట్టాలని అదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఎకో టూరిజం శాఖ చింతలమాదర జలపాతాన్ని గుర్తించిందని, త్వరలోనే అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. ఆయన వెంట ఎస్సై చుంచు రమేశ్, గిన్నెదరి ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'తొలిమెట్టు'కు సన్నద్ధం

- రెండో విడతకు విద్యాశాఖ కసరత్తు
- జిల్లా కేంద్రంలో నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ
- ఇప్పటికే రాష్ట్రస్థాయి శిక్షణ పూర్తి



ముత్తంపేట్‌లో బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

కౌటాల: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాల పెంపు కోసం తొలిమెట్టు కార్యక్రమాన్ని మరోసారి అమలు చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి శిక్షణ పూర్తికాగా, జిల్లా కేంద్రంలో సోమవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి.

జీవితానికి పునాది.. ప్రాథమిక విద్య

పాఠశాల దశలో అందించే ప్రాథమిక విద్యే విద్యార్థి జీవితానికి పునాది వంటిది. ఈ దశలో ఉత్తమమైన సామర్థ్యాలు సాధిస్తేనే విద్యార్థులు అన్ని రకాల నైపుణ్యాలు సాధించేందుకు వీలవుతుంది. కరోనా విలయం తర్వాత దిగజారిన విద్యా ప్రమాణాల పెంపు కోసం రాష్ట్ర విద్యాశాఖ తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతేడాది విజయవంతంగా తొలి విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏడాది రెండో విడత కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. దీని కోసం ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల బోధన, అభ్యసనలపై జూలై 13 నుంచి 15 తేదీల్లో హైదరాబాద్‌లో మూడు రోజులపాటు రాష్ట్రస్థాయిలో శిక్షణ అందించారు. అక్కడ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు జిల్లస్థాయిలో టీచర్లకు అవగాహన కల్పించనున్నారు.

నేటి నుంచి శిక్షణ షురూ

జిల్లాలో 633 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 21,598 మంది విద్యార్థులు ఉన్నారు. మొదటి విడత తొలిమెట్టు సత్ఫలితాలు ఇవ్వడంతో 2023–24 విద్యా సంవత్సరంలో రెండో విడత కార్యక్రమానికి విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో బోధనకు ఇబ్బందులు లేకుండా ప్రతీ మండలం నుంచి తెలుగు, ఇంగ్లిష్, గణితం ఉపాధ్యాయులు ముగ్గురు చొప్పున 15 మండలాల నుంచి 90 మంది ఉపాధ్యాయులు నేటి నుంచి నిర్వహించే శిక్షణ తరగతులకు హాజరుకానున్నారు. మూడు రోజుల పాటు 270 మంది టీచర్లకు శిక్షణ అందించనున్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఈ తరగతులు మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. నేడు, రేపు ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

శిక్షణకు ఏర్పాట్లు చేశాం



జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయులకు శిక్షణ అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన వారు మండల స్థాయిలో టీచర్లకు అవగాహన కల్పిస్తారు. రెండో విడత తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తాం.

– అశోక్, డీఈవో

సాధారణ ప్రసవాలు పెంచాలి

- డీఎంహెచ్‌వో రామకృష్ణ



కౌటాల: రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కౌటాల(సిర్పూర్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని డీఎంహెచ్‌వో రామకృష్ణ అన్నారు. కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, ప్రసూతి గది, మెడికల్ గది పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సాధారణ కాన్పులకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు అవసరమయ్యే అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యసిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గుండాయిపేట్‌లోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. జిల్లా అధికారి ఎండీ రషీద్, కౌటాల వైద్యాధికారి నవత, స్టాఫ్ నర్సులు వర్ష, సృజన తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బెజ్జూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రామకృష్ణ అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీకి రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో ఇన్‌చార్జి డాక్టర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు.

లోనవెల్లి పీహెచ్‌సీకి తాళం

సిర్పూర్(టి): మండలంలోని లోనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విధులకు హాజరు కాకుండా ఆదివారం పీహెచ్‌సీకి తాళం వేశారు. స్వయంగా డీఎంహెచ్‌వో రామకృష్ణ తనిఖీకి వచ్చినా.. విధుల్లో ఎవరూ లేరు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో అన్నారు. వారి పనితీరుపై సమగ్ర నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



తాళం వేసి ఉన్న పీహెచ్‌సీ

కిల్లింగ్.. ఓవర్‌లోడ్

- ఇసుక ట్రాక్టర్లు, కంకర టిప్పర్లతో తరచూ ప్రమాదాలు
- నిబంధనలు పాటించని వాహన యజమానులు
- పట్టించుకోని అధికారులు



కౌటాలలోని వైగాం వద్ద ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన ఇద్దరు యువకులు (ఫైల్)

ఈ నెల 3న కౌటాల మండలం వైగాం గ్రామానికి ఓవర్ లోడ్‌తో విద్యుత్ స్తంభాలు, ఇతర సామగ్రి తరలిస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బెజ్జూర్ మండలం ముంజంపల్లికి చెందిన బుర్రి వసంత్(26), అనిల్(24) ఇద్దరు అన్నదమ్ములు అక్కడిక్కడే మృతి చెందారు. డ్రైవర్ చిలుకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఒకే రోజు ఇద్దరు మృతి చెందడంతో ఆ గిరిజన కుటుంబం వీధిన పడింది.

కాగజ్‌నగర్– పెంచికల్‌పేట ప్రధాన రహదారిపై ఈ నెల 13న కాగజ్‌నగర్ మండలం సీతానగర్‌కు జుమిడి విమల(40), ఆమె కుమారుడు నితిన్(22), వారి బంధువు శేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రాస్పెల్లి సమీపంలో విద్యుత్ స్తంభాలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను గమనించకుండా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నితిన్ ఆదివారం మృతి చెందగా.. తల్లి విమల సోమవారం మృతి చెందింది. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్లు, లారీలతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.

కౌటాల(సిర్పూర్): జిల్లాలో ఇసుక, కంకర, విద్యుత్ స్తంభాలు తరలిస్తున్న వాహన యజమానులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలు బోల్తా పడటం, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుండటంతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. క్వారీల నుంచి ఇతర రాష్ట్రాలకు కంకరను తరలించే క్రమంలో గ్రామీణులు టిప్పర్ చక్రాల కింద నలిగిపోతున్నారు. ఇటీవల కౌటాల మండలం వైగాం సమీపంలో ఓవర్ లోడ్‌తో విద్యుత్ స్తంభాలు తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడడంతో ఇద్దరు కూలీలు మృతి చెందిన విషయం తెలిసిందే. ట్రాక్టర్లు, ట్రిపర్లు అధిక లోడుతో వరుసగా పదుల సంఖ్యల్లో పల్లెల మీదుగా దూసుకెళ్తున్నాయి.

నిత్యం రాకపోకలు

సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లో ఓవర్‌లోడ్‌తో భారీ వాహనాలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఆసిఫాబాద్, తిర్యాణితోపాటు ఏజెన్సీ ప్రాంతాల మీదుగా ఇసుక అక్రమ రవాణా అధికంగా జరుగుతోంది. 10 టైర్లు ఉన్న లారీ 20 టన్నులతో వెళ్లాల్సి ఉండగా 25 నుంచి 26 టన్నులతో.. 12 టైర్ల లారీ 26 టన్నులతో వెళ్లాల్సి ఉండగా సుమారు 32 టన్నులకు పైగానే లోడ్‌తో తిప్పుతున్నారు. గతేడాది డిసెంబర్ 4న కౌటాల మండలం యాపలగూడలో ట్రిప్పర్ ఢీకొని నాలుగేళ్ల చిన్నారి మృత్యువాత పడింది. వాస్తవానికి ట్రాక్టర్ వెనుక భాగంలో కేవలం 10 టన్నులను మాత్రమే తరలించేందుకు వీలుంటుంది. కానీ 15 నుంచి 17 టన్నుల వరకు లోడింగ్ చేస్తున్నారు. ఈ కారణంగా వాహనాలు అదుపుతప్పి బోల్తా పడటమో, ఇతర వాహనాలను ఢీకొట్టడమో జరుగుతోంది. కౌటాల మండలం ముత్తంపేట శివారులోని కంకర క్రషర్‌ల నుంచి రాత్రీపగలు తేడా లేకుండా కంకర తరలిస్తున్నారు. వాగులు, నదుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న క్రమంలోనూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం పరిహారం చెల్లించి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జాడలేని తనిఖీలు..



కౌటాల- కాగజ్‌నగర్ రహదారిపై టిప్పర్లలో ప్రమాదకరంగా బండరాళ్ల తరలింపు

ఓవర్ లోడింగ్ వాహనాల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించాల్సిన రవాణా శాఖ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగిన సమయంలో కేవలం ప్రజల దృష్టిని మళ్లించేందుకు నామమాత్రంగా తనిఖీలు చేపడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇటీవల వరుస ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయినా అధికారులు ఓవర్ లోడింగ్ వాహనాలను తనిఖీలు చేసి కనీస జరిమానాలు విధించకపోవడం గమనార్హం.

తనిఖీలు చేపడుతున్నాం

ఓవర్ లోడుతో వెళ్తున్న కంక ర టిప్పర్లు, ఇసుక ట్రాక్టర్లు, విద్యుత్ స్తంభాలు తరలించే ట్రాకర్లను నిత్యం తనిఖీ చేస్తూనే ఉన్నాం. సంబంధిత అధికారులకు సైతం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. నిబంధనలను పాటించని వాహనాల యాజమానులకు జరిమానా విధిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేస్తాం.

– జి.లక్ష్మి, ఆర్టీవో, ఆసిఫాబాద్

సిర్పూర్(టి)– కౌటాల మార్గంలో రాకపోకలు బంద్

సిర్పూర్(టి): భారీ వర్షాలకు సిర్పూర్(టి)– కౌటాల ప్రధాన రహదారిలోని పారిగాం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం బ్రిడ్జి పైనుంచి వరద ప్రవాహం ఉండటంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. వరద ఉధృతి పెరుగుతుండటంతో వాహనదారులు సిర్పూర్(టి)– కౌటాల ప్రధాన రహదారి గుండా ప్రయాణించొద్దని ఎస్సై దీకొండ రమేశ్ హెచ్చరించారు. సిర్పూర్(టి) మండలం పారిగాం, లోనవెల్లి, కర్జపల్లి, కంచర్‌పేట్, డోర్‌పల్లి గ్రామాలతోపాటు కౌటాల మండలం, చింతలమానెపల్లి మండలంలోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెన్‌గంగ ఉధృతి తగ్గిన తర్వాత రాకపోకలు పునరుద్ధరిస్తామని అధికారులు ప్రకటించారు.



పారిగాం బ్రిడ్జి వద్ద వేచి చూస్తున్న ప్రజలు



తాటిపెల్లి వద్ద వరద నీటిలో పంట చేలు

నీట మునిగిన పంటలు

కౌటాల(సిర్పూర్): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి పెన్‌గంగలో ఆదివారం వరద పెరిగింది. దీంతో కౌటాల మండలం తాటిపెల్లి, వీర్దండి గ్రామాల సరిహద్దులోని పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో పంట చేలు నీట మునిగాయి. పత్తి చేలతోపాటు మిర్చి, వరి నారుమడులు వందెకరాల్లో ముంపునకు గురయ్యాయి.

క్లుప్తంగా

యువకుడి మృతదేహం లభ్యం


అంజన్న(ఫైల్)

వాంకిడి: మండలంలోని బోర్దా గ్రామానికి చెందిన సెండె అంజన్న(18) కాల కృత్యాలు తీర్చుకోవడానికి గ్రామ సమీపంలోని ఒర్రె వద్దకు వెళ్లి శనివారం ఉదయం గల్లంతైన విషయం తెలిసిందే.. కాగా మండల అధికారులు మత్స్యకారుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం సాయంత్రం గుండి గ్రామ సమీపంలో మృతదేహం లభించినట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

యువత చూపు వైఎస్సార్‌టీపీ వైపు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న అజీమొద్దీన్

మంచిర్యాలక్రైం: తెలంగాణ రాష్ట్రంలో యువత వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని వైఎస్సార్ టీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్ అన్నారు. ఆదివారం మంచిర్యాల, ఆర్‌కే6 కొత్త రోడ్, ప్రాంతాల యువకులు వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు కేసీఆర్ చేతిలో మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుద్దాల ప్రభుదేవ్, దళిత విభాగం జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కవిరాజ్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రేకెందర్ ప్రియదర్శిని ఉన్నారు.

జాతీయస్థాయి వుషూ జడ్జీల ఎంపిక


సర్టిఫికెట్ తీసుకుంటున్న సతీశ్


సాయికృష్ణ

బెల్లంపల్లి/భైంసాటౌన్: జాతీయస్థాయి వుషూ జడ్జీలుగా నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన శ్రీరాముల సాయికృష్ణ, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన వేముల సతీశ్ ఎంపికయ్యారు. ఈ నెల 17 నుంచి 23 వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలోని సరళ బిర్లా యూనివర్సిటీ ప్రాంగణంలో వుషూ జడ్జీ, కోచ్‌ల శిక్షణ తరగతులు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 31 రాష్ట్రాల నుంచి దాదాపు 400 మంది కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు హాజరయ్యారు. ఆదివారం శిక్షణ తరగతులు ముగిసాయి. శిక్షణ పూర్తి చేసుకున్న సాయికృష్ణ, సతీశ్‌లకు వుషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ జితేందర్ సింగ్ పజ్వా, సెక్రెటరీ విజయ్ శరాఫ్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామానికి చెందిన చింతపూరి సత్యన్న ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఎస్సై సందీప్, పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.7500 విలువ గల ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నవోదయలో రాష్ట్ర క్లస్టర్ స్థాయి క్రీడా ఎంపిక పోటీలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని నవోదయ విద్యాలయంలో ఈనెల 27, 28వ తేదీల్లో రాష్ట్ర క్లస్టర్ స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, వాలీబాల్ అండర్–14, 17, 19 విభాగాల బాలుర, బాలికలు, 'సుబ్రతా కప్' ఫుట్‌బాల్ అండర్–14, 17 బాలురులు, బాలికలు 17 బాలికల ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

మద్యం మాన్పిస్తున్నారు..!

జీవితం మారింది..

ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు తాగుతూ ఎక్కడపడితే అక్కడ రోడ్లపై పడిపోయేవాడు. చుట్టుపక్కల వారు గమనించి ఆ వ్యక్తిని ఇంటికి తీసుకెళ్లేవారు. కుటుంబీకులు సైతం విసుగుచెంది మద్యానికి బానిసైన వ్యక్తిని డీ అడిక్షన్ సెంటర్‌లో చేర్పించారు. నెల రోజులపాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో ఆయన పూర్తిగా మారిపోయాడు. మద్యం మానేశాడు. ఆ తర్వాత కష్టపడి పని చేసుకుంటూ ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేశాడు. సొంత ఇంటిని నిర్మించుకున్నాడు. కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవిస్తున్నాడు.


కౌన్సెలింగ్ ఇస్తున్న నిర్వాహకులు

- ఆదిలాబాద్‌లో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రభుత్వ జిల్లా ఆస్పత్రుల్లో డీ అడిక్షన్ సెంటర్లు


పరీక్షిస్తున్న వైద్యుడు

సాక్షి, మంచిర్యాల డెస్క్: మద్యపానం అలవాటు వ్యసనంగా మారి కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. కొందరు మద్యానికి బానిసగా మారి ఒళ్లు.. ఇల్లు గుల్ల చేసుకుంటూ ప్రాణాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మద్యానికి బానిసగా మారిన ఓ బాలుడు ఇటీవల ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. మద్యానికి బానిసగా మాన్పించేందుకు జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రుల్లో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఆదిలాబాద్ రిమ్స్‌లో ఏర్పాటు చేసింది. మంచిర్యాలలో మెంటల్ హెల్త్ క్లినిక్‌గా నిర్వహిస్తూ మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలు ఇతర ఏ అలవాట్లు ఉన్నా చికిత్స అందిస్తున్నారు. సైకియాట్రిస్టు రెండు నెలలుగా ఓపీ చూస్తున్నారు. ఆదిలాబాద్‌లో డవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డీ అడిక్షన్ సెంటర్ నిర్వహిస్తూ వందలాది మందిని మద్యం మాన్పించారు. మద్యానికి బానిసగా మారిన వారు ఆయా కేంద్రాల్లో కౌన్సెలింగ్ ద్వారా మారవచ్చు.

ఆదిలాబాద్‌లో 'స్వచ్ఛంద'ంగా..



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో డవ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డీ అడిక్షన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. 2005లో ప్రారంభించిన ఈ సెంటర్‌లో ఇప్పటివరకు 1200 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతీ నెల 15మంది చొప్పున ఈ కేంద్రంలో చేర్చుకుని కౌన్సెలింగ్, చికిత్స అందిస్తారు. 2022 సంవత్సరంలో 180మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ సెంటర్‌లో కౌన్సెలింగ్‌తోపాటు మందులు, యోగా, ఫ్యామిలీ, వ్యక్తిగత కౌన్సెలింగ్ ఇస్తారు. ఉల్లాసం కోసం సాయంత్రం వేళల్లో ఆటలు ఆడిస్తుంటారు. కొందరిని బృందాలుగా ఏర్పాటు చేసి చర్చలు చేయిస్తారు. సైకియాట్రిస్టుతో వారానికి రెండు నుంచి మూడు రోజులపాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. రోజుకు మూడు పూటల భోజనం ఉచితంగా అందిస్తారు. ప్రతీ రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం, వారానికోసారి గుడ్డు కూరతో భోజనం పెడతారు. ఈ కేంద్రంలోనే కాకుండా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామాలకు వెళ్లి మద్యం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. మద్యానికి, మత్తు పదార్థాలకు ఎవరైనా అలవాటు పడి వ్యసనంగా మారిన వారిని గుర్తించి ఈ సెంటర్‌లో చేర్చుకుంటారు. సర్పంచ్, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, పోలీసుల ద్వారా వివరాలు సేకరిస్తారు.

బానిసగా మారి బాలుడి ఆత్మహత్య

- మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండల కేంద్రంలోని సత్యసాయినగర్ కాలనీకి చెందిన శివసాయి(16) కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయాలని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినిపించుకోలేదు. కుటుంబ సభ్యులు మందలించడంతో జూన్ 27న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలం కృష్ణపెల్లి గ్రామానికి చెందిన జయరాం(48) కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. జూన్ 29న ఇంట్లోనే ఉరేసుకున్నాడు.
- నిర్మల్ జిల్లా తానూరు మండల కేంద్రానికి చెందిన కారగిరి ఎల్లప్ప(40) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జూలై 2న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- నిర్మల్ జిల్లా భైంసా మండలం గుండెగాం గ్రామానికి చెందిన బాలాజీ(28) కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసగా మారి భార్యాపిల్లలతో గొడవపడేవాడు. జూలై 6న గడ్డెన్న వాగుప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.
- ఆదిలాబాద్ జిల్లా మావల పోలీసుస్టేషన్ పరిధిలోని న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన చిలుక రవీందర్(31) మద్యానికి బానిసగా మారి ఈ నెల 20న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తానిమడుగు గ్రామానికి చెందిన మోతె లింగయ్య(34) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. భార్య పుట్టింటికి వెళ్లిపోయినా మద్యం మానలేదు. ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

కౌన్సెలింగ్, భోజన వసతి..

మద్యం, మత్తు పదార్థాలకు బానిసైన వారికి డవ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. నెలకు 15 మంది చొప్పున సెంటర్‌లో చేర్చుకోవడం జరుగుతుంది. దాదాపు 30 శాతం మంది మారుతున్నారు. ఈ సెంటర్‌లో చేరిన వారికి కౌన్సెలింగ్‌తోపాటు భోజనం అందిస్తాం. గ్రామాలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎవరైన మద్యానికి బానిసైతే డవ్ సెంటర్‌లో సంప్రదించవచ్చు.

– చంద్రశేఖర్‌రెడ్డి, డవ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్

అన్ని అవయవాలపై ప్రభావం



మద్యపానం, మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా శరీరంలోని వెంట్రుకల నుంచి గోళ్ల వరకు అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుంది. మద్యం అలవాటు ఉన్నవారిని డాక్టర్ వద్దకు తీసుకెళ్లాలి. మొదటి డి టాక్సికేషన్ ట్రీట్‌మెంట్ అందించడం జరుగుతుంది. ఆ తర్వాడ డీ అడిక్షన్ చేస్తాం. వ్యక్తి ప్రశాంతంగా ఉండే విధంగా వైద్యం అందిస్తాం. అగోనెస్ట్ థెరపీ చేయడం జరుగుతుంది. పది రోజుల్లో సాధారణ స్థితికి వస్తారు. మద్యం జోలికి పోకుండా, మద్యమంటే ఇష్టపడకుండా ట్యాబ్లెట్లు ఇవ్వడం జరుగుతుంది. మద్యం సేవిస్తే రియాక్షన్ అయి వాంతులు, తలనొప్పి వంటివి జరిగి మద్యం జోలికి వెళ్లకుండా ఉంటారు. నెల రోజులపాటు వైద్యం అందిస్తాం. చాలామందిలో మార్పు వచ్చింది.

– డాక్టర్ ఓంప్రకాశ్, సైకియాట్రిస్ట్, రిమ్స్

ఏడాదిగా మంచంలోనే..

- తాటిచెట్టు పైనుంచి పడి నడవలేని స్థితిలో గీత కార్మికుడు
- రూ.8లక్షలతో గతంలో ఆపరేషన్
- మళ్లీ ఆపరేషన్ చేయాలంటున్న వైద్యులు
- అందని ప్రభుత్వ సాయం..
- వెన్నెముక, చేతులకు మానని గాయాలు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు
- కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న భార్య

జన్నారం: దేవుడు వరమిచ్చినా... పూజారి కరుణించడం లేదన్న చందంగా ఉంది గీత కార్మికుల పరిస్థితి. ప్రభుత్వం తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందినా... శాశ్వత వికలాంగులుగా మారిన రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే... అయితే నానా రకాల షరతులతో గీత కార్మికులు ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియాకు నోచుకోవడం లేదు. తాటి చెట్టుపై నుంచి పడి వెన్నెముక దెబ్బతిని, చేతి ఎముక విరిగి ఏడాదిగా మంచానికే పరిమితమైన గీత కార్మికుడికి ప్రభుత్వ సాయమందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో జన్నారం మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన సుద్దాల నగేశ్ ఏడాదిగా మంచానికే పరిమితమై మళ్లీ ఆపరేషన్ చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

కులవృత్తితోనే బతుకు..

జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన సుద్దాల నగేశ్ (30) కల్లు గీత వృత్తితో భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. పదేళ్లుగా కుల వృత్తిని నమ్ముకుని బతుకుతున్నాడు. మార్చి 27, 2022న కులవృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి దిగే క్రమంలో మోకుజారి చెట్టుపై నుంచి కింద పడిపోయాడు. గమనించిన తోటి గీత కార్మికులు ఆస్పత్రికి తరలించారు. నడుం వెన్నుపూస, చేతి ఎముక, కాలు ఎముకలు విరిగిపోవడంతో ఆస్పత్రిలో రూ.8లక్షల వరకు ఖర్చు చేసి ఆపరేషన్ చేయించారు. కానీ నేటికీ చేతి వెముక విరిగి బయటకు రావడంతో ఆపరేషన్ చేసి రాడ్ వేసి అతికించిన ఫలితం కానరావడం లేదు. దీంతో ఆ ఎముకను తొలగించాలని వైద్యులు సూచించారు. అయితే అప్పటికే అప్పు చేసి ఆపరేషన్ చేయించుకున్న నగేశ్ మళ్లీ ఆపరేషన్ చేయించుకోవడం కోసం చిల్లిగవ్వ లేక విలవిలలాడుతున్నాడు. అయితే కుటుంబ పోషణ భారంగా మారడంతో భార్య కూలి పనికి పోషించుకుంటుంది.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ...

చెట్టుపై నుంచి పడి ఏడాది అవుతున్నప్పటికీ నగేశ్ ప్రభుత్వం అందించే సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఎక్సైజ్ అధికారులు ఇంటికి వెళ్లి పరిస్థితి గమనించి సమస్య రాసుకుని వెళ్లారు. ఎక్సైజ్ అధికారులు ఒక ప్రొఫార్మ ఇచ్చి పూర్తి చేసి హెల్త్ సూపరింటెండెంట్ సంతకంతో తీసుకురావాలని సూచించారు. దీంతో ఆరు నెలలుగా మంచిర్యాల ఆస్పత్రికి వెళ్లినా సదరం సర్టిఫికేట్ మాత్రమే ఇస్తామని, ఎక్సైజ్ అధికారుల ప్రొఫార్మ ఇవ్వలేమని చెబుతున్నారు. ఈ విషయాన్ని ఎక్సైజ్ అధికారుల వద్దకు వెళ్లి చెప్పినప్పటికీ ప్రొఫార్మ కావాలని చెప్పడంతో నగేశ్ కుటుంబీకులు ఆందోళన చెందుతున్నాడు.


మంచంలో గీతకార్మికుడు నగేశ్

సదరం ఇస్తే

తాటిచెట్టుపై నుంచి పడి నడువలేని స్థితిలోని నగేశ్‌కు అధికారులు సదరం సర్టిఫికేట్ ఇస్తే ప్రభుత్వానికి ధరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అన్ని సర్టిఫికెట్లు పూర్తి చేసిన ఒక వైద్యాధికారుల నుంచి అందించే సదరం సర్టిఫికేట్ ఇవ్వాల్సి ఉంది. ఈ సర్టిఫికేట్ ద్వారా శాశ్వత వికలాంగుడా, లేదా అనే విషయం అధికారులు ప్రొఫార్మాలో రాసి ఇవ్వాలి. అయితే తాను సదరం కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేయలేని స్థితిలో ఉన్నట్లు నగేశ్ పేర్కొంటున్నారు. ఈ విషయంలో అధికారులు సహాయం చేయాలని కోరుతున్నాడు. అధికారులు స్పందించి ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్యంతో ఉన్న నగేశ్‌కు చేయూత అందించాలని కోరుతున్నాడు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

నగేశ్ తాటి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలైన విషయం తెలియడంతో మా శాఖ నుంచి చేయాల్సిన ఫార్మలిటీస్ పూర్తి చేశాము. ప్రభుత్వానికి పంపించాం. నిబంధన ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన ప్రొఫార్మ మెడికల్ సూపరింటెండెంట్ పూర్తి చేసి సంతకం చేసి ఇవ్వాలి. ఇతర జిల్లాల్లో ఈ ప్రొఫార్మ ఇస్తున్నారు. ఇక్కడ మాత్రమే ఇవ్వడం లేదు. ఈ విషయంలో మాత్రమే ఆలస్యం అవుతుంది. సూపరింటెండెంట్ ప్రొఫార్మ పూర్తి చేసి ఇస్తే ప్రభుత్వానికి పంపిస్తాం.

– సాయిబాబా, ఎక్సైజ్ సీఐ


తిర్యాణి: చింతల మాదర జలపాతం


నేరడిగొండ కొర్టికల్


పెంచికల్‌పేట్: కొండెంగ లొద్ది


హాజీపూర్: ర్యాలీ గ్రామ శివారులో


పెంచికల్‌పేట్: దొద్దులాయి

మహారాష్ట్రకు నిలిచిన రాకపోకలు

సిర్పూర్(టి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సిర్పూర్(టి) మండలం మీదుగా ప్రవహిస్తున్న పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పెన్‌గంగ మీదుగా వెళ్లే మహారాష్ట్ర గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. సిర్పూర్(టి) మండలంలోని వెంకట్రావ్‌పేట్ –పోడ్సా అంతర్రాష్ట్ర వంతెన వరదనీటిలో మునిగిపోయింది. మండలంలోని హుడ్కిలి గ్రామ సమీపంలోని వాగులోకి పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో వాగుపై ఉన్న లోలెవల్ వంతెన వరదనీటిలో మునిగిపోవడంతో అంతర్రాష్ట్ర రహదారిలో మండలంలోని హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి గ్రామాలతో పాటు ఈ రహదారి గుండా ప్రయాణాలు సాగించే మహారాష్ట్ర పట్టణాలకు రాకపోకలు నిలిచిపోయాయి.


మునిగిన వెంకట్రావ్‌పేట్-పోడ్సా వంతెన

డీఎస్పీ పరిశీలన...

కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ సిర్పూర్(టి) మండలంలోని అంతర్రాష్ట్ర రహదారులను పరిశీలించారు. ఈ రహదారుల్లో ఎలాంటి ప్రయాణాలు సాగించకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

మణిపూర్ అల్లర్ల కారకులను శిక్షించాలి

మంచిర్యాలక్రైం: మణిపూర్ అల్లర్లకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాశీ సతీశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మణిపూర్ ఘటనకు నిరసనగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజిమొద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుద్దాల ప్రభుదేవ్, నాయకులు రాజేంద్రప్రసాద్, ఓరం కవి రాజ్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రియదర్శిని, జావిద్ పాష, తేజ ఉన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

పాతమంచిర్యాల: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బొల్లం సోని, కార్యదర్శి రేగుంట చంద్రకళ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ఘటనకు నిరసనగా ఐబీ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

వాగులోపడి పశువుల కాపరి మృతి

జన్నారం: మండలంలోని దేవునిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకపుగూడకు చెందిన పశువుల కాపరి ప్రమాదవశాత్తు వాగులోపడి మృతిచెందాడు. ఎస్సై సతీశ్ వివరాల ప్రకారం... ఆరే ఎల్లయ్య (37) పశువుల కాపరి. ఆదివారం ఉదయం పశువులను తీసుకుని అడవిలోకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వాగులో మృతదేహం కనిపించడంతో కుటుంబీకులు వెళ్లిచూడగా ఎల్లయ్యదిగా గుర్తించారు. తల్లి పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నూతన గనులు ప్రారంభించాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో నూతన భూగర్భ గనులను ప్రారంభించాలని ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేకే–6, శ్రావణపల్లి గనులు పర్యావరణ, ప్రజాభిప్రాయ సేకరణ పనుల పూర్తి అయ్యాయని, అనుమతులు తీసుకువస్తే ఇంకా ఉద్యోగుల అవసరం ఏరియాలోనే ఉంటుందని సూచించారు. గత ఆర్థిక సంవత్సరం లాభాల వాటా 35శాతం చెల్లించాలని చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు రాంబాబు, ఓదెలు, వెంకటస్వామి, శేఖర్, కుమార్, రవీందర్, బాపు తదితరులు పాల్గొన్నారు.

కరాటే కోచ్‌గా నాగలక్ష్మి

మంచిర్యాలటౌన్: తెలంగాణ కరాటే అసోసియేషన్ గరల్స్ టీం కోచ్‌గా మంచిర్యాలకు చెందిన నాగలక్ష్మిని నియమించారు. రాష్ట్రస్థాయి కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కరాటే అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ ఈ.శ్రీనివాస్, సెక్రెటరీ నరేందర్, కోశాధికారి సాయికుమార్ ఆమెకు నియామకపత్రం అందజేశారు.


నియామకపత్రం అందుకుంటున్న నాగలక్ష్మి

'చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి'

నస్పూర్: పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆగస్టు 12వ తేదీన చేపట్టే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం పాత పింఛన్ సాధన సంకల్ప యాత్ర చేపట్టారు. మంచిర్యాలలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థితప్రజ్ఞ మాట్లాడారు. 2004 నుంచి అమల్లోకి వచ్చిన సీపీఎస్ విధానంతో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక భద్రత లేదన్నారు. నాయకులు కాసబోయిన సురేష్, ఇత్యాల కిషన్, మేడి శంకర్, బండ రాజేందర్, శ్రీనివాస్, సత్యనారాయణ ఉన్నారు.